నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం | 24 ఏప్రిల్ 2025 | పేజీలు 8

దేశాన్ని ఎదురుగా ఢీకొట్టలేని ఆ ఉగ్ర పైశాచికం మళ్లీ పడగ విప్పుతుందా.. అమాయక ప్రజలనే టార్గెట్ చేస్తూ.. మొత్తం దేశాన్నే భయపెట్టాలని చూసే ఆ పిరికిపందులకు నెల్లూరులోని ఆందోళన కారులు ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నిరసన, ఆందోళనలతో సవాల్ విసురుతున్నారు. ఉగ్రదాడికి నెల్లూరులో నిరసనలు పెల్లుబికాయి. మృతులకు సంతాప సూచికగా కొవ్వొత్తుల ర్యాలీలు చేపట్టారు.



ఉగ్రదాడిలో మృతి చెందిన కావలివాసి మధుసూధన్ (భార్య పిల్లలతో కలిసి దిగిన ఫ్యామిలీ ఫోటో ఫైల్)



# ఉగ్ర పైశాచికం

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

- నెల్లూరంతట పెల్లుబికిన నిరసనలు, ఆందోళనలు
- సంతాప సూచికగా కొవ్వొత్తుల ర్యాలీలు
- ఖండించిన రాజకీయ నేతలు, సంఘ నాయకులు
- దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు




జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ.. రాజకీయ నాయకులు, ప్రజా, కుల సంఘాల నాయకులతోపాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసనలు తెలియజేశారు. ఉగ్రదాడి పిరికిపందల చర్య అని.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.

లోపల పేజీలో

## ఎన్నికల్లో చేసిన ప్రతి హామీ అమలు చేస్తాం



- చంద్రబాబు పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారు
- అతి త్వరలో విడవలూరులో మిని స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తాను
- సమాజ సేవపై ఆసక్తి ఉన్న విద్యావంతులు సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయండి
- ధాన్యం విక్రయించిన 24 గంటలలో రైతుల అకౌంట్లలో నగదు జమ కావడం ఇదే మొదటిసారి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

విడవలూరు, మేజర్‌న్యూస్ :

సాగునీటి కాలువలలో పూడికలు తీయడం రైతుల పాలిట వరమైందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా ఆమె విడవలూరు గ్రామాన్ని బుధవారం సందర్శించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. కోవూరు నియోజక వర్గాన్ని అభివృద్ధికి రోల్‌మాడల్‌గా తీర్చిదిద్దాలన్న ఏకైక లక్ష్యంతో పని చేస్తున్నట్టు తెలిపారు. నేరుగా ప్రజల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకోవడం కోసమే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటలలో రైతుల ఖాతాలలో డబ్బులు జమ అవ్వడమే కాకుండా హమాలి కూలీలు కూడా ప్రభుత్వం అప్పటికప్పుడే చెల్లించడం ఇదే మొదటిసారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలను ప్రజలతో మమేకం చేయడం కోసమే నెలకో సారి పెన్షన్ల పంపిణి, స్వచ్ఛ ఆంధ్ర, పబ్లిక్ గ్రీవెన్స్ లాంటి కార్యక్రమాలను చంద్రబాబు నాయుడు రూపకల్పన చేశారన్నారు. విడవలూరులో మినీ స్టేడియం నిర్మాణంతో పాటు డిగ్రీ కళాశాల ప్రహారి నిర్మాణాన్ని కూడా అతి త్వరలోనే పూర్తి చేస్తానన్నారు. విడవలూరులోని ఇందిరమ్మ కాలనీ, కామాక్షి నగర్ ప్రాంతాలను త్వరలోనే పర్యటించి అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధిస్తానన్నారు. ఎన్నికలలో చేసిన హామీలను ఒక్కోటిగా అమలు చేసుకుంటూ ముందుకెళ్తున్నామని అభివృద్ధి సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ పరిపాలన చేయడం చంద్రబాబు నాయుడుకే

-మిగతా 2లో

## ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో రైతుల భేటీ

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో దామరమడుగు చెరకు రైతులు భేటీ అయ్యారు. బుధవారం ఈ మేరకు నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో ఆమెతో భేటీ అయి వివిధ అంశాలపై మాట్లాడారు. ఫ్యాక్టరీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ..

మిగతా 03లో



నేరాలు ఛేధించుటకు సాంకేతికతను

## అందిపుచ్చుకోవాలి




వివరాలు 02లో

ఏపీ ఎస్పీ బెటాలియన్ ఐజీ రాజకుమారి

నేరాలు ఛేధించేందుకు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఏపీ ఎస్పీ బెటాలియన్ ఐజీ రాజకుమారి సూచించారు.

# కందుకూరులో స్పెషల్ డ్రైవ్

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టీవీఎస్ లక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం పామూరు బస్టాండ్ సర్కిల్‌లో వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి చెన్నూరి రాంబాబు వాహన చోదకులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించి, అదేవిధంగా వాహనాల యొక్క ధ్రువపత్రాలను పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సీటు బెల్ట్ లేకుండా ప్రయాణం చేస్తున్న రెండు కార్లను, పరిమితిని మించి ప్రయాణం చేస్తున్న రెండు ఆటోలను, ఒక గూడ్స్ వాహనానికి డ్రైవింగ్ లైసెన్స్ లేనికారణంగా కేసు నమోదు చేశారు. అనంతరం ప్రాంతీయ రవాణశాఖాధికారి టీవీఎస్ నాగలక్ష్మీ వాహనచోదకులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలు నడుపునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, వాహనాల్లో ఉంచుకోవాల్సిన ధృవీకరణ పత్రాల గురించి తెలియజేశారు.



## ఎన్నికల్లో చేసిన ప్రతి హామీ అమలు చేస్తాం



*(మొదటి పేజీ తరువాయి)*

సాధ్యమన్నారు. నిరక్షరాస్యత నిర్మూలనలో ప్రజా ప్రతినిధులు, నాయకులు భాగస్వాములై కోవూరు నియోజకవర్గంలో సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ నగేష్ కుమారి, ఎంపీపీ ఏకుల శేషమ్మ, టీడీపీ మండల అధ్యక్షులు చెముకుల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి, మాతూరు శ్రీనివాసులు రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, సత్యంరెడ్డి, వాసు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో రైతుల భేటీ

*(మొదటి పేజీ తరువాయి)*

షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, చెరకు రైతుల సంక్షేమంపై ఆమె చేస్తున్న కృషిని కొనియాడారు. అలాగే పలు అంశాలను చెరకు రైతులు ఆమె దృష్టికి తెచ్చారు. రైతులకు వారి వాటా ధనం ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని చెల్లించేందుకు ఏర్పాటు చేయాలని కోరారు. అత్యంత విలువైన షుగర్ ఫ్యాక్టరీ భూములను ప్రైవేటుపరం కాకుండా కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, వీలైనంత త్వరగా రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. 2024 ఎన్నికల సందర్భంగా షుగర్ ఫ్యాక్టరీలో కార్మికుల బకాయిలు చెల్లించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో షుగర్ ఫ్యాక్టరీ అంశాలపై పలుమార్లు చర్చించినట్లు వివరించారు. దాంతో చెరకు కార్మికులకు 29 కోట్ల బకాయిలు, రైతులకు చెల్లించాల్సిన వాటాధనం చెల్లింపుపై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. అలాగే భూములను ఏపీఐఐసీకి కేటాయించి కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటుకు నిర్ణయించారన్నారు. ఈ విషయంలో రైతులందరూ సహకరిస్తే ఆ స్థలాల్లో వేలాది మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు ఏర్పాటు చేసి కోవూరు అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాటలకు చెరుకు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ప్రశాంతమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యేకు తాము ఎప్పుడూ మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు.



కార్యక్రమంలో టిడిపి నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీరెడ్డి, బెజవాడ జగదీష్, కేవీ శేషయ్య, చెరకు రైతులు సోమారెడ్డి మల్లికార్జున, వత్సల హరిరెడ్డి, హరిపోత్తమరెడ్డి, పాలిచర్ల వేణురెడ్డి, పోనకా రవీందర్ రెడ్డి, కొండా రఘువులు, మానేగుంట శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు చేధించుటకు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

## ఏపీఎస్పీ ఐజి రాజకుమారి

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నేరాలు చేధించేందుకు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఏపీ ఎస్పీ బెటాలియన్ ఐజి రాజకుమారి సూచించారు. బుధవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ నిర్వహిస్తున్న నేర సమీక్షా సమావేశానికి ఐజి బి.రాజకుమారి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) ద్వారా పర్యవేక్షించారు. జిల్లాలో చోటు చేసుకున్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలలో రికవరీల గురించి స్టేషన్స్ వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. నేరాలు చేదించుటకు సాంకేతికతను అందిపుచ్చుకోనేందుకు పలు సూచనలు తెలియజేశారు. సాంకేతికను బాగా ఉపయోగించుకొని నెల్లూరు జిల్లా మంచి పురోగతి సాధించిందని జిల్లా ఎస్పీని అభినందించారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని, అలా అన్ని వివరాలు నమోదు చేయడం వలన కేసులు, వ్యక్తుల పూర్తి సమాచారం తెలుస్తుందని, అది అందరికి ఉపయోగపడేలా దోహదం చేస్తుందని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమంలో భాగంగా హెల్త్ ఇన్సురెన్స్ ప్రాముఖ్యత గురించి వివరించారు. విలేజ్ విజిట్ అందరూ తప్పక చేయాలని ఆదేశాలు.. తద్వారా రాబోయే సమస్యలను అరికట్టవచ్చు.. పరిష్కరించవచ్చు. వేసవి కాలం కనుక దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, డ్రోన్ సర్వైలెన్స్ విరివిగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ వారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై ఆరా తీసారు. కేసు దర్యాప్తులలో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని కేసులను దర్యాప్తు చేయాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులు పట్ల అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ఫోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. తప్పించుకుని తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, వారిపై ఉన్న ఎన్‌బీడబ్ల్యులు (నాన్ బెయిలబుల్ వారెంట్లు) వెంటనే అమలు చేయమని ఆదేశించారు. మిస్సింగ్ కేసులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెంటనే చేధించాలని ఆదేశించారు. కొత్త న్యాయ చట్టాల మీద ప్రతి ఒక్కరు పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పీజీఆర్ఎస్ పిటిషన్లను తక్షణమే పరిష్కరించాలని, డయల్ 112 కాల్స్‌కు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలన్నారు. రాత్రి పూట అన్ని స్టేషన్లలో గస్తీలు ముమ్మరం చేయాలని, అనుమానితుల వేలిముద్రలు సేకరించాలని సూచనలిచ్చారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, ఫోక్సో రేప్ కేసులు, డెకాయిటీ, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు 174 క్రైం పీసీ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డీపీఓకు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్, పెండింగ్ ఎన్‌బీడబ్ల్యులు, ఎన్‌డీపీఎస్ కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తదుపరి ఈగల్ టీమ్ ప్లకార్డులను ఆవిష్కరించి, రేపటి తరం భవిష్యత్తు మాకు ముఖ్యం.. డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ మా లక్ష్యమని, మనమందరం కలిసి పోరాడుదాం.. మత్తు పదార్థాల వ్యసనం నుండి మన పిల్లల్ని కాపాడుకుందామని తెలిపారు. సమావేశంలో ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీ శ్రీనివాసులు రెడ్డి, టౌన్, రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరు, ట్రైనింగ్, ఏఆర్ డీఎస్పీలు, ఇతర జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# కాశ్మీర్ ఉగ్రదాడిలో కావలి వాసి మృతి

## మృతుడు మధు శరీరంలో దిగిన 42 రౌండ్ల బుల్లెట్లు - భౌతికకాయం కోసం చెన్నై వెళ్లిన తహసిల్దార్


**కావలి, మేజర్‌న్యూస్ :** కాశ్మీరులోని అనంతనాక్ జిల్లాలోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో కావలి 33వ వార్డు ఆనాలవారి వీధికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ రావు మృతి చెందిన విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. మృతిని వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మేదర బజార్లో అరటికాయల వ్యాపారం చేస్తున్న తిరుపాలు, పద్మావతి దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. అందరికీ వివాహాలు చేశారు. మృతుడు మధుసూదన్‌రావు ఐబిఎంలో, ఆయన భార్య ప్రసన్న కామాక్షి టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. వీరికి కూతురు మేదశ్రీ ఇంటర్ పూర్తి చేయగా, కుమారుడు దత్తసాయి 8వ తరగతి చదువుతున్నారు. బెంగళూరులోనే రామ్మూర్తి నగర్ ఖమ్మన్ హాలిలో సొంత ఇల్లు నిర్మించుకొని స్థిరపడ్డారు. అనారోగ్యంతో ఉన్న తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేందుకు తరచూ మధుసూదన్ రావు కావలికి వచ్చి తండ్రి వ్యాపారం చూసుకునే వారు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు చేయించి మధుసూదనరావు కుటుంబం ఈనెల 18వ తేదీ రాత్రి కావలి నుండి బెంగళూరుకి వెళ్లారు. పిల్లలకు సెలవులు కావడంతో ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి కాశ్మీరు విహారయాత్రకు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం వరకు సరదాగా సాగిన వారి విహారయాత్ర ఫోటోలు బంధువులకు పంపారు. అంతలోనే విహారయాత్రలో ఉన్నవారి పేర్లు అడుగుతూ ఉగ్ర మూక విచక్షణ రహితంగా జరిపిన కాల్పులు జరిపారు. మధుసూదన్‌రావు శరీరంలోకి 42 రౌండ్లు బుల్లెట్లు దూసుకుపోవడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. ఈ వార్త కావలిలో వారి బంధువులకు తెలియడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.



భార్యతో మధుసూధన్‌రావు (ఫైల్)

# మతోన్మాదుల పిరికిపందల చర్యలను ఖండిస్తున్నాం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**
మతోన్మాదుల పిరికిపందల చర్యలను తాము ఖండిస్తున్నామని జనసేన నాయకులు పేర్కొన్నారు. మారువేషంలో పది మంది వచ్చి అమాయకుల ప్రాణాలు బలి తీసుకున్నంత మాత్రాన జాతి సమైక్యతను దెబ్బ తీయలేరన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడిలో బలైన భారతీయులకు కుటుంబాలకు సంతాపాన్ని ప్రకటిస్తూ జనసేన పార్టీ తరపున సంతాపం తెలియజేశారు. పవన్ కళ్యాణ్ సూచనల మేరకు ఈ మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన ఈ మూడు రోజులు సాయంత్రం 6 గంటలకు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద క్యాండిల్ ర్యాలీ, గురువారం సాయంత్రం అంబేద్కర్ విగ్రహం వద్ద కాండిల్ ర్యాలీ, శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ బొమ్మ వద్ద మానవహారంతో సంతాపం తెలిపి జాతి స్ఫూర్తిని ముందుకు తీసుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కిషోర్ గునుకుల, సుందర్ రామిరెడ్డి, జమీర్, శ్రీరామ్, కృష్ణారెడ్డి, రవి,కొట్టె వెంకటేశ్వర్లు, పావుజెన్ని చంద్రశేఖర్, హరిరెడ్డి, కాకు మురళి, నాగిశెట్టి మురళి, బిల్లా ఉదయ్, యాసీన్, పవన్, రాజేష్, వెంకట్, ఆబిద్, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.



## మృతులకు నివాళులర్పించిన వైసీపీ

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జమ్మూ కాశ్మీర్ ఉగ్రమూకల కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మశాంతి కోసం నెల్లూరు నగరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వీఆర్సీ సెంటర్లో పాకిస్తాన్ తో పాటు ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయకృష్ణా రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రీత్ రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.



నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా వైఓ నందన్ పూర్తి బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలోని కమీషనర్ ఛాంబర్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు.

**– నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

### జనసేన దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ఆధ్వర్యంలో

# కొవ్వొత్తుల ప్రదర్శన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కాశ్మీర్ కొండల్లో టెర్రరిస్టుల మారణకాండను నిరసిస్తూ బుధవారం నగర జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సుమారు 200 మంది జనసేన నాయకులు, కార్యకర్తలు నగరంలోని గాంధీబొమ్మ వద్దకు చేరుకుని అమరులైన వారికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడుతూ జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మూడు రోజుల పాటు సంతాప దినాలు ప్రకటించారన్నారు. అందులో భాగంగా బుధవారం జాతీయ జెండాను అవనతం చేయడం జరిగిందని, అదే విధంగా కొవ్వొత్తులతో నివాళులు అర్పించామన్నారు. గురువారం, శుక్రవారం కూడా నిరసన, మానవహారం నిర్వహిస్తామన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఒకేసారి 28 మందిని పొట్టన పెట్టుకోవడం బాధాకరమన్నారు. అందులో మన రాష్ట్రం నుంచి ఇద్దరు ఉండటం మన జిల్లా వాసి వారిలో ఒకరు అవటం హృదయ విదారకం అని, ఇలాంటి చర్యలకు మరోసారి ఎవ్వరూ చేయకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శులు శనివారపు అజయ్ బాబు, షేక్ ఖాదర్, నగర కార్యదర్శులు సుమంత్, డివిజన్ ఇన్చార్జిలు బిల్ల ఉదయ్ కిరణ్, శ్రీమంతుల కిషోర్, కనగలూరు సురేష్, ఊటుకూరు శ్యామ్, చుక్కల భీమయ్య, భార్గవ రాముడు, పసుపులేటి శ్రీనివాసులు, పెడడా ఆనందరావు, వంగాల శ్రీనివాసులు రూరల్ ఐటీ కో-ఆర్డినేటర్ చరణ్ రామ్, నగర కార్యదర్శి బీదవాకం బాలు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీఐఈఓ సుబ్బారావుకు శుభాకాంక్షలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈఓ)గా సుబ్బారావు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సునీల్ శర్మ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌతం, ఉపాధ్యక్షులు కిరణ్, బంగారు వెంకటేశ్వర్లు, అసోసియేషన్ సభ్యులు లవకుమార్, సుబ్బారావు, దేవరాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## టెర్రరిస్టుల దాడిని తీవ్రంగా ఖండించిన ఆదాల

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**
జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌వాసుల మరణంపై మాజీ ఎంపీ, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైసీపీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన బుధవారం ఒక ప్రకటనలో టెర్రరిస్టుల దాడిని తీవ్రంగా ఖండిం చారు. బాధిత కుటంబీకులకు మాజీ ఎంపీ ఆదాల తన ప్రగాఢ సానుభూ తిని వ్యక్తం చేసి మృతులకు సంతాపం ప్రకటించారు. ఆ కుటుంబాలను ఆదుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్య అని పేర్కొన్నారు. బాధిత కటుంబాలను ఆదుకుని అండగా నిలవాలని కేంద్రాన్ని ఆయన కోరారు.



### ఉగ్రవాదుల దాడి మృతులకు

## సంతాపం తెలిపిన కోటంరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మ శాంతి కోసం భగవంతుని ప్రార్థిస్తూ ఆ కుటుంబాలకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. ఉగ్రవాదులకు వ్యతిరేక పోరాటంలో దేశం మొత్తం ఒక్కటిగా నిలవాలని ఆకాంక్షించారు.

### ఉగ్రవాదులను అణిచివేతలో

## కేంద్ర ప్రభుత్వ వైఫల్యం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి పిరికి పందల చర్య. ఈ దాడిలో 30 మంది చనిపోవడం, మరికొంత మంది గాయపడటం తీవ్రంగా కలిచి వేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చేవూరు దేవకుమార్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరారు. ఈ దాడిలో మరణించిన వాళ్లలో ముగ్గురు తెలుగువాళ్లు ఉండటం అత్యంత బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా నిలబడాలని, అలాగే ఉగ్రవాదంపై పోరుకు యావత్ దేశం కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో..

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఏఎస్పేట మండలములో పదవ తరగతి పరీక్ష ఫలితాలు క్రింది విధంగా ఉన్నాయి. ఏఎస్పేట మండలం నందు మొత్తం 7 ఉన్నత పాఠశాలలు ఒక మోడల్ పాఠశాల ఒక కస్తూరిబా పాఠశాల ఉన్నాయి. మండలంలోని శ్రీ కొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24మంది పరీక్ష రాయగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ఆ పాఠశాల నుండి సిహెచ్ వైష్ణవి అత్యధికంగా 600కు గాను 589 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కావలి యడవల్లి నుండి 20 మంది గాను 17 మంది ఉత్తీర్ణులైనారు. ఆ పాఠశాలకు చెందిన ఎం వర్షిత 582 మార్కులతో మండల ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిరమన పాఠశాలలో 24కుగాను18మంది ఉత్తీర్ణత సాధించి ఆ పాఠశాల నుండి జి సాయి సమద్విత 578 మార్కులు సాధించారు. అలాగే మోడల్ పాఠశాల లో 65 కు గాను 62 మంది ఉత్తీర్ణులైనారు జి.నిహారి 581 మార్కులు సాధించారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దూబగుంట యందు13 కు గాను 12 మంది ఉత్తీర్ణత సాధించి పి.వినయ్ శ్రీ 572 మార్కులు సాధించారు. అలాగే గుడిపాడు హైస్కూల్ లో 13 మంది పాసై నూరు శాతం ఉత్తీర్ణత సాధించి డి మంజుల 563 మార్కులు సాధించారు. అలాగే గుంపర్లపాడు హైస్కూల్లో 18 మందికి గాను 13 మంది ఉత్తీర్ణత సాధించారు పి.యశస్విని 526 మార్కులు సాధించింది ఏ ఎస్ పేట లోని జడ్పీ హైస్కూల్లో 43 మందికి గాను 32 మంది ఉత్తీర్ణత సాధించి వి.వైశాలి 559 మార్కులు సాధించారు. అలాగే కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 37 మందికి గాను 32 మంది ఉత్తీర్ణత సాధించి వి హేమలత 556 మార్కులు సాధించారు ఈ సందర్భంగా ఎంఈఓ డి సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఏఎస్ పేట మండలంలో మొత్తం 257 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా 223 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 34 మంది ఫెయిల్ అయినట్లు తెలిపారు. అలాగే ఏ ఎస్ పేటలోని ఠాగూర్ పాఠశాలలో 37 మంది పరీక్ష రాయగా 37 మంది పాసై నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో ఎండి అప్పా 584 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే సోమల సంజీవని 581 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది ఎం.హనీప్రియ 578 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది.

## పదవ తరగతిలో మెరిసిన విద్యా కుసుమం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం లోని బ్రాహ్మణకాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కేవిపిఆర్ భార్గవి పదవ తరగతి పరీక్షలలో 591 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానాన్ని పొందారు. రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి ఫలితాలను బుధవారం విడుదల చేసింది. సోమవరప్పాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఎం మహిమా తరుణిక 579 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో, బ్రాహ్మణక్రాక లోని శ్రీ విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి జీ.శ్రీవర్ధన్ 577 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలోని విద్యార్థినీ విద్యార్థులు 308 మంది పరీక్షలు రాసి 254 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలం మొత్తం మీద 82.47శాతం ఉత్తీర్ణత సాధించారు. బ్రాహ్మణ కాక ప్రైవేటు పాఠశాల శ్రీ విద్యానికేతన్ విద్యార్థులు 25 మంది పరీక్షలు రాసి 24 మంది ఉత్తీర్ణులై 96శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు వన్నె తెచ్చారు.

## 591 మార్కులు సాధించిన నేహా ఫర్హాత్



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించి మట్టిలో మాణిక్యంగా, ఆణిముత్యంగా నిలిచింది ముదివర్తిపాలెం హై స్కూల్ విద్యార్థినిని షేక్. నేహాఫర్హాత్. ప్రతిభ కనబరిచిన ఆ బాలికను తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం, గ్రామంలోని ప్రజలు, ఆ బాలిక స్నేహితులు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తపరుస్తున్నారు.

## పదిలో ఠాగూర్ పాఠశాల విద్యార్థుల విజయ దుందుభి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబరిచి విజయ దుందుభి మోగించారు ఠాగూర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 37 మంది పరీక్షలకు హాజరుకాగా 37 మంది ఉత్తీర్ణులైన నూరు శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలిచారు పాఠశాలకు చెందిన ఎండి అప్స (584) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది అలాగే ద్వితీయ స్థానంలో సోమల సంజీవని (581) మార్కులు తృతీయ స్థానంలో ఎం.హనీప్రియ (578) మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు అలాగే 550కి పైన మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 11 మంది,బీ 500 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 20 మంది ఉన్నారని ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి డైరెక్టర్ కె దొరస్వామి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల విజయానికి దోహదపడిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన గుడి భార్గవ్



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 593 మార్కులతో ఇందుకూరు పేట మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన ఎన్‌వీఆర్‌ఆర్ జెడ్‌పి హెచ్ స్కూల్ విద్యార్థి గుడి భార్గవ్. ప్రతిభ కనబరిచిన ఈ భార్గవ్ను ఎంఈఓ సునీల్ కుమార్ సన్మానించడం జరిగింది. అలాగే ఈ విద్యార్థి మండల స్థాయిలో సాధించిన మొదటి స్థానం పట్ల తల్లిదండ్రులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఆ పిల్లవాడి స్నేహితులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతిభ చాటిన శ్రీవివేకానంద విద్యార్థులు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు లోనే శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం వెలువడిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో అద్భుత ప్రతిభను చాటారు. పాఠశాలకు చెందిన ఆలా వెంకట హైందవి 600 మార్పులకు గాను 590 మార్కులు మలిరెడ్డి చేతన్ 600 మార్కులకు 580 మార్కులు అలాగే బండి దీక్షిత 600మార్కులకు 582 మార్కులు సాధించారు ఈ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం మద్దూరు గోపాల్‌రెడ్డి, ఆర్మీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## సరస్వతి పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శ్రీ సరస్వతి ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం వెలువడిన పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో విజయభేరీ మోగించారు. పాఠశాలకు చెందిన బొమ్మ మధుప్రియ 600 మార్కులకు 589 మార్కులు సిహెచ్ కార్తికేయ 600 మార్కులకు 586మార్కులను సాధించి తమ ప్రతిభను చాటారు. అదేవిధంగా 500 పైగా 15 మంది విద్యార్థులు మార్కులను సాధించి తమ ప్రతిభను చాటారు ఈ విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ పోలు అంకిరెడ్డి డైరెక్టర్ రేవు నూరి వెంకటేశ్వర్ రెడ్డి అభినందనలు తెలిపారు. అలాగే ఈ అద్భుత విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఈస్ట్ వుడ్స్ ఇంగ్లీష్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు గ్రామ సమీపంలో ఉన్న ఈస్ట్ వుడ్స్ ఇంగ్లీష్ పాఠశాల విద్యార్థులు బుధవారం వెలువడిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో అద్భుత విజయాన్ని సాధించింది. పాఠశాలలో విద్యను అభ్యసించిన చిన్నారులచే రెడ్డి తనూజ 600 మార్కులకు 590 మార్కులు సాధించి అద్భుత ప్రతిభను చాటింది. అదేవిధంగా ఓం శాంత్ రామ్ 600 మార్కులకు 587 మార్కులు సాధించి తన ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పి.మధుబాబు వైస్ ప్రిన్సిపాల్ డిపి ప్రసాద్‌లు ఈ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు మొదటి నుండి అకుంఠిత దీక్షతో పట్టుదల ఆత్మ విశ్వాసంతో కష్టపడి చదివారని అందుచేతనే ఈ విజయం సాధ్యమైంది అన్నారు. అలాగే భవిష్యత్తులో ఇదే విధమైన కృషిని చేసి ఉన్నత చదువులు చదివి ఉత్తమ స్థానాలలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం వై.కోటిరెడ్డి, డి.శ్రీనివాసులు, పి.ప్రతాప్, అనిత, పి.శ్రీనివాసులు, ఏ.జయరామిరెడ్డి విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.

## 10 ఫలితాలలో హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ప్రైవేట్ స్కూళ్లకు దిమ్మ తిరిగే రిజల్ట్ షాక్ ఇచ్చారు. గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థులు. బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పొదలకూరు బాలికల హైస్కూల్ విద్యార్థిని ఎం.సాయి దేవకి 591.తాటిపర్తి హైస్కూల్ విద్యార్థిని పివి తనిష్క 586 పొదలకూరు బాయ్స్ హైస్కూల్ విద్యార్థి జివి శ్రీనివాసులు 582 మార్కులు సాధించి తాము ప్రైవేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోమని నిరూపించారు.

## పది ఫలితాల్లో అమరావతి స్కూల్ ప్రభంజనం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** బుధవారం విడుదలైన పదోవ తరగతి ఫలితాల్లో పొదలకూరు పట్టణానికి చెందిన అమరావతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పేట చైత్ర అనే విద్యార్థిని 600 మార్కులకు గానూ 591 మార్కులు సాధించింది. 6 గురు విద్యార్థులు 580కి పైగా మార్కులు, 550కి పైగా 31 మంది విద్యార్థులు, 500కి పైగా 59 మంది విద్యార్థులు సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ కే.సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ స్కూల్లో చదివిన విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణులు సాధించారని అంకిత భావంతో ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చు అనేదానికి అమరావతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిదర్శనం అని అన్నారు. తమ విద్యార్థులు చదువుతోపాటు ఆట పోటీల్లో సైతం రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి మెడల్స్ కూడా సాధించినట్లు తెలిపారు. మంచి విద్యాబోధన, అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే బోధన ఇస్తున్నట్లు అన్నారు. అలాగే అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను అమరావతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో యాజమాన్యం అభినందించింది. కేక్ కట్ చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. తమ స్కూల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు.

## నారాయణ విద్యార్థుల జయభేరి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నారాయణ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ అందరి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో విజయభేర్యం మ్రోగించారు.పాఠశాల విద్యార్థులు ఎం.దేవి చరణ్, వి.సంతోష్ 600 మార్కులకు 595 మార్కులు సాధించారు. అలాగే ఎన్.సాయికిరణ్ 593 మార్కులు వివి సాత్విక్ 591 వై.ప్రణవ్ 591 మార్కులను సాధించి జయభేరీ మ్రోగించారు. గత సంవత్సరంలో కూడా ఈ పాఠశాల విజయభేరిని మ్రోగించగా అదేవిధంగా ప్రస్తుత సంవత్సరం కూడా తన జయభేరిని కొనసాగించారు. ఆ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.ప్రమీలరెడ్డి డీన్ ఏ.మల్లికార్జున, ఉపాధ్యాయ బృందం అభినందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా పాఠశాల విద్యార్థులు ఎంతో కష్టంతో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించి ఉపాధ్యాయ బృంద ప్రోత్సాహంతో ఈ యొక్క విజయాన్ని సాధించగలిగారని తెలిపారు అదేవిధంగా భవిష్యత్తులో కూడా ఈ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తూ పాఠశాల పేరును తమ తల్లిదండ్రులకు మంచి పేరును తెస్తారని ఆశిస్తున్నట్లు వారు తెలిపారు.

## వసతి గృహ విద్యార్థి ప్రతిభ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు లోనే బాలుర బీసీ వసతిగృహ విద్యార్థి పి.వైదిక్ 600 మార్కులకు కాను 584 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. వసతి గృహ సంక్షేమ అధికారి షేక్ రియాజ్, బీసీ కళాశాల బాలుర వసతి గృహ సంక్షేమాధికారి పి.వెంగళరావు కలసి వైదిక్‌ను తీసుకొని వెళ్లి కావలి ఏబీసీడబ్ల్యూ అధికారి ఎం.రవికుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా రవికుమార్ ఆ విద్యార్థినీ ప్రతిభకు మెచ్చి ప్రశంసించారు. భవిష్యత్తులో చక్కగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుకున్నారు.

## అద్భుత ఫలితాలను సాధించిన విద్యార్థులు



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** 2025, మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పల్లిపాడు విద్యార్థులు విజయదుందుభి మోగించారు. బుధవారం విడుదలైన ఫలితాలలో మెరిట్ మార్కులు సాధించారు. 600 మార్కులకు గాను ప్రథమస్థానం గూడూరు. నవ్యత 577 మార్కులు, ద్వితీయస్థానం - వెండికళ్ళు, ప్రణవి సాయి - 576 మార్కులు, తృతీయ స్థానం కాటూరి, సరస్వతి 574 మార్కులు, తరువాతి స్థానం జానా. శిషిత 573 మార్కులు, సాధించారు. పాఠశాలలో 12 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించి మండల స్థాయిలో తమ హవాను కొనసాగించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడ్లూరు. సుబోస్ బాబు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు. ఘనవిజయం సాధించడానికి కృషి చేసిన పాఠశాల సిబ్బందికి ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## పొదలకూరులో మండల ఫస్ట్ నారాయణదే..



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణం స్థానిక గేట్ సెంటర్ నారాయణ విద్యాసంస్థలో ప్రభంజనం. మండల ఫస్ట్ ఎన్.నీరజాక్షి 593, మండల సెకండ్ ఇద్దరు ఎస్కే. రిహాన్ ఇస్ఫర్ 591, ఎన్ఎస్ఎస్ సునందన 591, మండల తర్డ్ ఎ.సాయి సిరి 590 విజయం సాధించారు. ఈ సందర్భంగా, ప్రిన్సిపాల్ కేఎం తులసి మాట్లాడుతూ.. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకి ముందుగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చిన ఘనత ఒక్క నారాయణ విద్యాసంస్థలకే దక్కుతుందన్నారు. అదేవిధంగా నారాయణ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ విద్యార్థుల భవిష్యత్ కోసం కృషి చేస్తున్నారు. అనంతరం విద్యార్థులు, మాట్లాడుతూ మేము ఈ స్థాయికి చేరుకోవడంలో మా తల్లితండ్రులుతో పాటు, మాకు చదువు నేర్పిన గురువులు సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో కృష్ణపట్నం విద్యార్థులు భేష్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కృష్ణపట్నం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు బేష్ అనిపించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఈ స్కూలు 80.39 శాతం రిజల్ట్ సాధించింది. హై స్కూల్ స్థాయిలో కె.సంజన విద్యార్థిని 562 మార్కులు కైవసం చేసుకుని ప్రథమ స్థానంలో నిలిచింది. అదేవిధంగా ద్వితీయ స్థానం నందు 550 మార్కులు సాధించి కె.యజ్ఞతేజ, అదేవిధంగా తృతీయ స్థానం నందు కే జీవిశ్రీ 524 మార్కులు సాధించారు. స్కూల్ హెడ్మాస్టర్ సరళ మాట్లాడారు. కష్టపడి విద్యార్థులు చదవడం వల్ల ఈ ఫలితాలు సాధించామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు అధికార పార్టీ నాయకులు వై.కోదండ రామయ్య, ఎంపీటీసీ సభ్యులు ఆనందయ్య, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వావిళ్ళ వెంకటరమణయ్య సంయుక్తంగా అభినందించారు.

## పది ఫలితాల్లో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రభంజనం



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలం నరసాపురంలోని స్థానిక ఎంవీఆర్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులు మండల స్థాయిలో పదవ తరగతి ఫలితాల్లో విజయ ప్రభంజనాన్ని కొనసాగించారు. 2025 మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఇందులో 59 సంవత్సరాల పాఠశాల పదవ తరగతి ఫలితాల చరిత్రలో మొట్టమొదటిసారిగా అద్భుతమైన మార్కులతో గుడి భార్గవ్ 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. పాఠశాల స్థాయిలో గుడి భార్గవ్ 593 మార్కులతో ప్రథమ స్థానాన్ని, షేక్ షాదికా 563 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, పామంజి మహేష్ 549 మార్కులతో తృతీయ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. 510కి పైగా 12 మంది విద్యార్థులు సాధించడం మరో అద్భుతమని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ అఖండ విజయాన్ని సాధించడం మా పాఠశాలకు గర్వకారణమని పాఠశాల యాజమాన్య కమిటీ అభినందించింది. ఒక రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో, అంకితభావం గల అనుభవజ్ఞులైన సిబ్బందిని కలిగి ఉండటం మా పాఠశాల బలమని, ఈ స్థాయి విజయం సాధించడం మా విద్యార్థుల సామర్థ్యానికి ప్రతీక అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు కొనియాడారు. ప్రభుత్వ పాఠశాల అంటే ఒక నమ్మకమని, అది ఈ ఫలితాలతో వెల్లడైందని విద్యార్థి భార్గవ్ తల్లిదండ్రులు శ్రీనివాసులు, సుజాత తెలిపారు. ఇదంతా అనుభవజ్ఞులైన సిబ్బంది వల్లే సాధ్యమైందని విజేతల తల్లిదండ్రులు తెలిపారు. ఇంతటి గొప్ప ఫలితాలను సాధించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు కొనియాడారు.

## మర్రిపాడులో 84 శాతం ఉత్తీర్ణత



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మర్రిపాడు మండలంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు బుధవారం మండల విద్యాశాఖాధికారులు జ్యోతి, ధనలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి వారు అభినందనలు తెలియజేశారు. మండలంలో మొత్తం 377 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 316 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలలో నందవరం మోడల్ స్కూల్ విద్యార్థులు మండలంలో మొదటి ఐదు స్థానాలు దక్కించుకొని ప్రతిభ చూపారు. నందవరం మోడల్ స్కూల్ విద్యార్థులు లహరి 582 మార్కులతో ప్రథమ స్థానం, మహిత 581 మార్కులతో ద్వితీయ స్థానం, రమ్య 580 మార్కులతో తృతీయ స్థానం, మనోహర్ 574 మార్కులతో, యశ్వంత్ 573 మార్కులతో సత్తా చాటారు. కదిరినాయుడు పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన శృతి 571 మార్కులు, చిలకపాడు ఉన్నత పాఠశాలలు చెందిన అమృత 570 మార్కులు సాధించారు. బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలో 24కి 22 మంది, చిలకపాడు ఉన్నత పాఠశాలలో 18కి 13 మంది, చుంచులూరు ఉన్నత పాఠశాలలో 29కి 19 మంది, కంప సముద్రం ఉన్నత పాఠశాలలో 22కి 21 మంది, కదిరినాయుడు పల్లి ఉన్నత పాఠశాలలో 17కి 16 మంది, మర్రిపాడు ఉన్నత పాఠశాలలో 45కి 30 మంది, నందవరం ఉన్నత పాఠశాలలో 39కి 31 మంది, పోలిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 26కి 24 మంది, పొంగూరు ఉన్నత పాఠశాలలో 15కి 13 మంది, టీ.ఎన్.పేట ఉన్నత పాఠశాలలో 29కి 24 మంది, కేజీబీవీ మర్రిపాడు నందు 37కి 35 మంది, నందవరం మోడల్ స్కూల్ నందు 76కి 68 మంది ఉత్తీర్ణత సాధించారు.

## పది పరీక్షల్లో 74 శాతం ఉత్తీర్ణత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బుధవారం వెలుబడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో షేక్ మస్తాన్వలి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 368 మంది విద్యార్థులు హాజరు కాగా 273 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. అక్షిత 571, షేక్ తస్నిమిఫిజా 570, మండలంలోని గడ్డంవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డి.స్రవంతి 568 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు.

## ఇన్ఫాంట్ జీసస్ విద్యార్థుల అద్భుత ప్రతిభ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోనే ఇంఫాన్ జీసస్ ఇంగ్లీష్ మీడియం పాఠ శాల విద్యార్థులు తమ అద్భుత ప్రతిభను కనబరిచారు. బుధవారం వెలువడిన పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో కె.సాహితీ 600 మార్కులకు 575 ఎం.హర్షవర్ధన్ 600 మార్కులకు 573 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. ఈ విద్యార్థులను కరస్పాండెంట్ ఐజాక్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## వికసించిన విద్యా కుసుమాలు..

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలంలో 2024–25 విద్యా సంవత్సరంలో బుధవారం వెలువడిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 79శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వేణుగోపాల రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం పరీక్షలకు 352 మంది హాజరు కాగా అందులో బాలురు 147 బాలికలు 205 మంది ఉన్నారు. పాసైన వారిలో 101 మంది బాలురు 137 మంది బాలికలు ఉన్నారు. తోటపల్లి గూడూరు జడ్పీ హైస్కూల్ నుంచి సిహెచ్ విజ్ఞాన్ జోషిక అత్యధికంగా 585 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థాయిలో నిలిచింది. ద్వితీయ శ్రేణిలో ఈదూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన కే.సాయితేజ 564 మార్కులు సాధించారు మూడవ శ్రేణిలో ఇదే పాఠశాలకు చెందిన కే.లక్ష్మి 563 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈఓ తెలిపారు. మొత్తం మీద బాలుర కంటే బాలికలు అధిక శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.



# గృహ నిర్మాణాల కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేయాలి

## బీజేపీ నేత మిడతల రమేష్ కలిసి విజ్ఞప్తి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో థర్డ్ ఆప్షన్ గృహ నిర్మాణాల కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేయాలని అమరావతిలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండి శివప్రసాదను బిజెపి నేత మిడతల రమేష్ కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో థర్డ్ఆప్షన్ నిధులు విడుదల చేసి గృహ నిర్మాణాలు వేగవంతం చేశారు. ఒక్క నెల్లూరు జిల్లాలో మాత్రం కొంతమంది అధికారుల అవినీతి మూలంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. కాంట్రాక్టర్ల బకాయిల డబ్బులు ప్రభుత్వం వద్దనే ఉండిపోయాయి. నెల్లూరు జిల్లాకు నిధులు విడుదల చేస్తే లక్ష గృహాల పనులు వేగవంతం అవుతాయని రమేష్ వివరించారు. ఒక ఏడాదిగా నెల్లూరు జిల్లాలో గృహ నిర్మాణాలు ఆగి ఉన్నందున ఇంటి కట్టడాలు బలహీన పడుతున్నాయి. గతంలో వైయస్సార్ నగర్ గృహ నిర్మాణ సమయంలో నిధులు విడుదలలో నెలకొన్న జాప్యం వలన వందల ఇల్లు నివాసయోగ్యం కాకుండా పోయిన విషయం గుర్తు చేశారు. అన్ని జిల్లాలలో విజిలెన్స్ తనిఖీలు పూర్తయ్యాయి. నెల్లూరు జిల్లాలో విజిలెన్స్ దర్యాప్తు నామమాత్రంగా ఉన్నందున గృహ నిర్మాణాలలో జాప్యం ఏర్పడింది. కొంతమంది కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసినప్పటికీ మూడు సంవత్సరాలుగా వారి బకాయిలు చెల్లించకపోవడంతో గృహ నిర్మాణాలు నామమాత్రంగా జరుగుతున్నాయి. నిధులు వెంటనే విడుదల చేసి పనులు వేగవంతం చేయాలని ఎండికి రమేష్ విజ్ఞప్తి చేశారు.

# అనుమతుల్లేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో అనుమతి లేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఉద్యమిస్తామని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముక్కు రాధాకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు నెల్లూరు జిల్లా కలెక్టరేట్లో డిఆర్ఓ ఉదయభాస్కర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యావత్తు రియల్ ఎస్టేట్ అక్రమాల పుట్టగా తయారైందన్నారు. అందులో భాగంగా నెల్లూరు నగరంలో నెల్లూరు జిల్లాలో కూడా అవినీతి. అక్రమాలు. పెచ్చు మీరుతున్నాయని. వేలాదిగా రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని అయితే ఎక్కడా కూడా నుడ. రెరా పర్మిషన్లు తీసుకోకుండా కనీసం డిటిసిపి పంచాయతీ అప్రూవల్స్ కూడా లేకుండా లేఔట్ లు వేస్తూ ఇష్టానుసారంగా బోగస్ ప్రకటనలు చేస్తూ ప్రజలను మోసం చేస్తూ ప్లాట్లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న యాజమానాలు కోట్లాది రూపాయలు ధనార్జన చేస్తున్నాయని. ఇచ్చిన. ప్రకటనలు గాలికి వదిలి ఇస్తామన్న వసతులు కల్పించకుండా పంట కాలవలు ప్రభుత్వ భూములు శివారు. భూములు అటవీ భూములు కలుపుకొని ప్లాట్లు వేసి పార్కులకు దేవాలయాలకు మసీదులకు చర్చలకు ఇతర అవసరాలకు వదిలినట్లు మ్యాపుల్లో బ్రోచర్లలో చూపుతూ వాటిని ప్లాట్లుగా విడగొట్టి అమ్ముకుంటున్నారని, అలాగే ల్యాండ్ కన్వర్షన్ మాత్రమే చేసి గ్రామపంచాయతీ గాని డిటిసిపి గానే నుడా రేరా వంటి సంస్థల పర్మిషన్లు తీసుకోకుండా వాటి వివరాలతో కూడిన బోర్డులు పెట్టకుండా ప్లాట్లు అమ్ముతున్నారని దీన్ని పూర్తిగా అడ్డుకుంటామని అలాగే కన్స్ట్రక్షన్ విషయంలో ప్లాన్ అప్రూవల్ ఒక విధంగా తీసుకుని నిర్మాణాలు మాత్రం ప్లాన్ ప్రకారం కట్టకుండా. అక్రమాలకు. పాల్పడుతున్నారని దీనిపై అధికారులు ప్రజాప్రతినిధులు మాత్రం చోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు కావున పై విషయాలు పై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గణేష్ నాయుడు, దామెర్ల శివప్రసాద్ పి.ఉదయ్ కుమార్, కె,మధు, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ లేఔట్ లో లబ్ధిదారులకు అవగాహన



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు హౌసింగ్ లేఅవుట్ లో హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించిన నెల్లూరు హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంవి.మోహన్ రావు, బిజెపి మండల ఆధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి హౌసింగ్ ఏఈ ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సహాయకులు, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రవి పాఠశాల విద్యార్థులు విజయభేరి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని రవి ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం వెలువడిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో విజయభేరి మోగించారు. పాఠశాలకు చెందిన టి.కిరణ్ 600 మార్పులకు గాను 590 మార్కులు సాయి ప్రేమ్ కుమార్ 600 మార్కులకు 584 మార్కులు అలేఖ్య 600 మార్కులకు 581 మార్కు జాహ్నవి 600 మార్పులకు 580 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. ఈ విద్యార్థులను ఆ పాఠశాల యాజమాన్యం మహేష్ శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

## టెన్త్‌లో శ్రీచైతన్య విజయదుందుభి





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్లో పదవతరగతి విద్యార్థులు అత్యధిక శాతం మార్కులు సాధించి విజయదుందుభి మ్రోగించారు. ఈస్కూలు విద్యార్థిని మండల ఫస్ట్‌గా నిలిచారు. 71మంది ఈ స్కూలు విద్యార్థులు టెన్త్ పరిక్షలకు హాజరుకాగా బుధవారం విడుదలైన ఫలితాల్లో మొత్తం నూటికినూరు శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఐదుమంది అత్యంత టాపర్లుగా నిలువగా 54మంది 500కన్నా అధికంగా మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. ఈ స్కూలుకు చెందిన బి.సంజన 600కుగాను 595మార్కులు సాధించి అత్యంత టాపరుగా నిలిచారు. ఇదే స్కూలుకు చెందిన అంజని 593మార్కులు, మేఘన 591మార్కులు, సుప్రియ 591మార్కులు, లిఖిత 590మార్కులు సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్ గంగాధర్ పేర్కొంటూ విద్యార్థులను అభినందించారు. తమ పాఠశాల ఉపాధ్యాయులు బోధనాశ్రద్ధ, విద్యార్థులకృషి ఈ ఫలితాలు లబించాయని ఆయన పేర్కొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ అమలుపై సంబరాలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంపై బుధవారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేపట్టారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు విలేఖరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ మంద కృష్ణమాదిగ 30ఏళ్ల పోరాట ఫలితమేనన్నారు. ఉన్నత పదవులను సైతం వదులకుని మాదిగ జాతి కోసం ఆహోర్నిశలు కష్టపడ్డారన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులు ఎస్సీ వర్గీకరణ అమలుకు చొరవ చూపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బకీరు జాషువా, బెజవాడ బాలగురవయ్య, గడ్డం రాజా, ఇత్తడి రమణ, గురవయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లికానుక అందజేత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని కృష్ణంపల్లి బీసీ కాలనీకి చెందిన పేరుబోయిన నాగేశ్వరరావు, బాలచెన్నమ్మల కుమార్తె శిరీష వివాహం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కాకర్ల ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న రూ.10వేలు పెళ్లి కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, ఉప్పుటూరి పెదవెంకటయ్య, సుబ్బారెడ్డి, రామ్మోహన్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవ వేడుకలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవడం ప్రశంసనీయమని మండల విద్యాశాఖ అధికారి హేమ సుందర్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని బలిజ పాలెం ప్రభుత్వ పాఠశాల నందు మూడవ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. విద్యా కమిటీ పాలకవర్గం, గ్రామస్తులు, తల్లిదండ్రులు సహకారంతో ఈ కార్యక్రమాన్ని జరిపినామని హెడ్మాస్టర్ లలిత అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి వార్షికోత్సవ వేడుకలు ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలకు నాంది పలుకుతున్నాయని తెలియజేశారు. కష్టపడి చదువుకుంటే ప్రభుత్వ పాఠశాలలు మేలు అనే విషయాన్ని ఫలితాలు ఋజువు చేస్తున్నాయని మండల విద్యాశాఖ అధికారి తెలియజేశారు. తదుపరి విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలపై 4వ రోజు సాగుతున్న ధర్నా

- దళిత గిరిజనలు అడ్డగించుకున్న భూములపై మాఫియా కన్ను
- దళిత గిరిజనుల భూ సమస్యపై చోద్యం చూస్తున్న అధికారులు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాలుగవ రోజు తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉత్కంఠంగా సాగుతున్న ధర్నా ఊటుకూరు దళితులపై మైనింగ్ మాఫియా పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి, దళితులు అక్రమణలో గల ప్రభుత్వ భూములకు యాజమాన్యం హక్కు కల్పించాలని, భూస్వాముల ఆధీనంలో ఉన్న సర్వేనెంబర్ 356, 359 గల 400 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమణలు తొలగించి దళితులకు ఇతర పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ సైదాపురం మండలం, ఉటుకూరు గ్రామ దళితులు బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరవదిక ధర్నా నాలుగోవ రోజు నిర్వహించారు. ఆ సందర్భంగా జరిగిన ధర్నాను ఉద్దేశించి అఖిల భారత రైతుల కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.పి పోలయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలో దళితుల పై అక్రమ కేసులు, పోలీసుల వేదింపులు, భూ ఆక్రమణలు అధికార పార్టీ అండదండలతో ఎదేచ్ఛగా కొనసాగుతున్న వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ నేపద్యంలో ఉటుకూరు గ్రామంలో వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి గ్రామ సర్వే నెం. 359-పి1 లో 60 ఎకరాలు ప్రభుత్వ భూమిని మైనింగ్ లీజుకు కొరకు అప్లై చేసుకున్నారన్నారు. ఇంకా ఇ.సి. కుడా పెండింగ్‌లో వుందన్నారు. ఈ క్రమంలో అదే సర్వే నెం. 359-పి2లో 50ఎకరాలు ప్రభుత్వ భూమిని దళితులు ఆక్రమించి చదును చేసి వ్యవసాయం చేసుకొనే క్రమంలో మైనింగ్ మాఫియకు సైదాపురం తహశీల్దారు తొత్తుగా మారి ఎలాంటి అనుమతులు లేకుండా వున్న దళితుల ఆక్రమణలో వున్న ప్రభుత్వ భూములను వెంకటకృష్ణ మైనింగు కంపెనీకి అప్పగించడం వల్ల మైనింగ్ మాఫియ పోలీసులు ద్వారా తీవ్రమైన వత్తిడి చేసి దళితులపై అక్రమ కేసులు పెట్టించారన్నారు. అదే సర్వే నెంబరు గల ప్రభుత్వ భూమిలో భూస్వాములు, పెత్తందారుల అక్రమంగా 10 ఎకరాల చొప్పున ఆక్రమణ చేసి వ్యవసాయం చేస్తుంటే ఆక్రమణ దారులపైన ఎలాంటి కేసులు గానీ, నిషేద బోర్డులు గానీ పెట్ట లేదన్నారు. తక్షణమే జిల్లా కలెక్టరు స్పందించి మైనింగ్ మాఫియకు తొత్తుగా మారిన సైదాపురం మండల తహశీల్దారు వారిపై చర్యలు తీసు కొని, దళితులపై మైనింగ్ మాఫియ పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, దళితుల భూములకు యాజమాన్య హక్కు కల్పించాలని, సర్వే నెం 359, 356 నందు గల 400 ఎకరముల ప్రభుత్వ భూముల ఆక్రమణలను జిల్లా సర్వేయరు ద్వారా సర్వే చేసి ఆక్రమణలను తొలగించి, భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో గల ప్రభుత్వ, బంజర, మిగులు, పోరంబోకు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమిలేని నిరుపేదలకు భూమిని పంచి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమైఖ్య జిల్లా అధ్యక్షులు కె.రమేష్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు బి.మమత, ఎ.నాగమణి, ఎం.వెంకరమణమ్మ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు, పి.కోటయ్య, పి.శ్రీను, ఎ.హరిబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా వాసిని ఉగ్రవాదులు బలి తీసుకోవడం బాధ కలిగిస్తుంది. కాశ్మీర్ లోయలో ఉగ్రవాదుల నరమేధాన్ని బీజేపీ నేత మిడతల రమేష్ ఖండించారు. పాకిస్తాన్ తీవ్రవాద సంస్థ లష్కరె తాయిబా అనుబంధ సంస్థ హిందువులే లక్ష్యంగా చేసుకొని 28మందిని కాల్చి చంపడం ఆందోళనకరంగా ఉందన్నారు. ఉగ్రమూకల మారణకాండలో నెల్లూరు జిల్లా వాసి సోమిశెట్టి మధుసూదన్ రావు ఉగ్రకాల్పుల్లో బలి కావడం జిల్లా వాసులను కలచివేస్తుంది. ఉగ్రవాదులు ఖురాన్ సూక్తులు చెప్పించి ముస్లింలు కాదని నిర్ధారించుకొని హిందువులను లక్ష్యంగా మారణకాండ సాగించారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు భారతదేశంలో హిందువులను లక్ష్యంగా చేసుకున్నట్లుగా అర్థమవుతుంది. ఈ ఉగ్రదాడి దేశంలో హిందువులకు హెచ్చరిక జారీ చేసినట్లు ఉంది. ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని రమేష్ డిమాండ్ చేశారు. తీవ్రవాదం పట్ల హిందువులు జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. ఉగ్రమూకలను సమూలంగా నిర్మూలించాలని భారత ప్రభుత్వానికి రమేష్ విజ్ఞప్తి చేశారు.

## సోమిరెడ్డి సహకారం మరువలేనిది : రైతులు



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలం కోవెర పాలెం గ్రామంలోని రైతులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తమ పొలాల్లోకి వెళ్లేందుకు బాట లేక ఇబ్బంది పడుతున్న రైతులు స్థానిక నాయకులు గంగపట్నం సుధీర్ బాబు ముత్యాల గణేష్ ఆధ్వర్యంలో సోమిరెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు 300 ఎకరాలు ఉన్న తమ పొలాల్లో నుంచి వెళ్ళడానికి వడ్లు తరలించే దానికి బాట లేనందున సోమిరెడ్డిని కలిసామని వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధుల క్రింద సుమారు కిలో మీటర్‌కు 5లక్షలు చొప్పున 2కిలోమీటర్లకు బాట వేసుకునేందుకు అనుమతిచ్చారని గ్రావెల్ కూడా శాంక్షన్ చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి రైతులందరూ కృతజ్ఞతలు తెలిపారు.

## సమైక్య కార్యాలయం నందు అవగాహన



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుధవారం బుచ్చిరెడ్డిపాలెం మండల సమైక్య కార్యాలయం నందు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, అక్రమరవాణా, లైంగిక వేధింపులు, మహిళా, శిశు చట్టాల గురించి పొదుపు వివో లకు అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి అధ్యక్షులుగా బుచ్చి ఎంపీడీవో శ్రీహరి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. అక్షరాస్యత గురించి వివరంగా తెలియజేశారు. ఏటీఎం శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్ గురించి, పోక్సో చట్టం గురించి, పోష యాక్ట్ గురించి, జేజే యాక్ట్, -2015 గురించి జిల్లా బాలల సంరక్షణ అధికారి బి. సురేష్ తెలియజేశారు.ఈ సమావేశంలో నేర్చు కున్న విషయాలను పొదుపు సంఘాలు లో అందరికీ తెలియజేయాలని ఏపీఎం శ్రీధర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పివోఐసి సుమలత, ఓఎస్‌సి కౌన్సిలర్ టి. కమల, సీసీలు, వివోలు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ నేతాజీ విద్యార్థిని నిహారిక అద్భుత ప్రతిభ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ నేతాజీవికాస్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.నిహారిక బుధవారం వెలువడిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో 600 మార్కులకు 590 మార్పులు సాధించే తమ అద్భుత ప్రతిభను చాటారు. ఈ విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ కెవి రత్నం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేస్తున్న తెల్లరాయి



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సైదాపురం మండలం జోగిపల్లిలో ఆగని తెల్లరాయి మాఫియా బుధవారం తెల్లరాయి గ్రేడింగ్ చేస్తున్న కూలీలు అనంతరం బ్యాగులకు నింపుకొని రాత్రుల్లో తరలిస్తున్న తెల్లరాయి టన్ను 30వేల నుండి 50వేల రూపాయలు ధర పలకడంతోనే మాఫియా చెలరేగిపోతుందంటున్న స్థానిక ప్రజలు. అధికారుల కళ్ళు కప్పి తెల్లరాయి మాఫియా దారులు లీజు కాలపరిమితి అయిపోయినటు వంటి మైనింగ్‌ను యథాచేదుగా తెల్లరాయి పని చేస్తూ రాత్రుల్లో తరలించడం జరుగుతుందని ఇకనైనా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ప్రభుత్వ ఖజానాకు పోవాల్సిన సొమ్మును కాపాడాలని స్థానిక ప్రజలు తమ ఆవేదన వ్యక్తపరిచారు.

## బాలాజీనగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిన




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం స్థానిక 13వ డివిజన్ బాలాజీ నగర్, పరిసర ప్రదేశాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. మస్టర్ అటెండెన్స రిజిస్టర్లో హాజరైన పారిశుధ్య కార్మికులు ఫీల్డ్‌లో పని చేస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. పారిశుధ్య ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడి రోజుకు ఎన్ని ట్రిప్స్ వేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వార్డులోని అన్ని ఇళ్ళకి వెహికల్స్ వెళ్లి డోర్ టు డోర్ కలెక్షన్ చేయవలసిందిగా, ఎక్కడ బ్లాక్ స్పాట్ లేకుండా చూసుకోవాలని సూచించారు. వార్డు సచివాలయ సెక్రటరీలు, మేస్త్రిలు వార్డులోని అన్ని మైనర్ డ్రైన్స్ పర్యవేక్షించి ఎక్కడ బ్లాక్ అవుతుందో, ఎక్కడ సిల్ట్ ఎక్కువగా ఉందో చూసుకొని రెగ్యులర్‌గా డీసిల్టేషన్ చేస్తూ స్ప్రేయింగ్ చేయించాల్సిందిగా సూచించారు.

## ప్రత్యామ్నయ పంటలపై రైతులకు అవగాహన



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని లింగసముద్రం, అనంత మడుగు పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి రైతులకు ప్రత్యామ్నాయ పంటలమీద భూసార పరీక్షలు మీద రైతులకి అవగాహన కల్పించడం జరిగింది. అయితే వరి వేసిన తర్వాత అక్కడ ఉన్న తేమతో సమ్మర్ పల్సస్ పంటలు రైతులు వేసుకోవచ్చు అని జొన్న, నువ్వులు, వంటి ప్రత్యామ్నాయ పంటలు కూడా రైతులు వేసుకున్నట్లయితే పొలాలను ఖాళీగా ఉంచకుండా వ్యవసాయం చేయవచ్చని రైతులకు తెలియజేయడం జరిగింది. అలాగె ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలని రైతులకు భూమిపై ప్రత్యామ్నాయ పంటల పైన రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి హైమావతి తెలిపారు.

# దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లో ప్రతి 14 రోజులకు ఒకసారి ఫాగింగ్ ప్రక్రియను అమలు చేస్తూ, ఆయిల్ బాల్స్ పిచికారి, గంబుజియా చేప పిల్లల పెంపకం తదితర కార్యక్రమాలతో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ వై.ఓ. నందన్ సూచించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఐ.వి.ఆర్.ఎస్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పారిశుధ్య నిర్వహణ పనుల సంతృప్తి 70శాతం కన్నా తక్కువగా ఉన్నట్లు గుర్తించామని, దానిని మెరుగుపరిచేందుకు అందరూ కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. రోడ్లపై నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలు,సిమెంట్ బస్తాలు, బ్యాగులు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా పర్యవేక్షించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు అంతర్గత బదిలీలను చేపట్టాలని, గృహాల నిష్పత్తి ప్రకారం కార్మికుల కేటాయింపు జరపాలని కమిషనర్ సూచించారు. 24 గంటల్లో గార్బేజి ల నుంచి చెత్తను సేకరించే విధంగా ప్రణాళికలు రూపొందించుకుని, ఇంటింటి చెత్త సేకరణలో తప్పనిసరిగా తడి పొడి చెత్తను విడిగా సేకరించేలా పారిశుద్ధ సిబ్బందిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. శానిటేషన్ మేస్త్రీలు విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ప్రధాన రోడ్లు, వీధుల పరిశుభ్రతలో భాగంగా ఏ ప్రాంతాన్ని అసంపూర్తిగా వదలకుండా రోడ్ల చివరి వరకు ఎండ్ టు ఎండ్ శుభ్రం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో ఫ్లోర్ పాయింట్లు అన్నవి లేకుండా పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. స్పెషల్ శానిటేషన్ వర్క్స్ లలో భాగంగా డ్రైను కాలువల పొడవులను బట్టి కార్మికులను కేటాయించి గ్యాంగ్ వర్కులు చేయించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు చెత్తను తరలించే సమయంలో వ్యర్థాలు రోడ్లపై పడకుండా తప్పనిసరిగా పూర్తిస్థాయిలో కప్పి ఉంచేలా జాగ్రత్త చర్యలు తీసుకునేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా డ్రైన్ కాలువల పూడిక తీత, సిల్ట్ ఎత్తివేత పనులను చేపట్టాలని, తడి పొడి చెత్తను విడివిడిగా సేకరించేలా సిబ్బందిని పర్యవేక్షించాలని అదనపు కమిషనర్ ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్టిలో ఉంచుకొని అవుట్డోర్ విభాగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులందరికీ రక్షణ కొరకు టోపీలను కమిషనర్ అందజేశారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, శానిటేషన్ సూపరింటెండెంట్, శానిటేషన్ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్యభవన్ ఆధునీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని మత్స్య భవన్‌ను ఆధునీకరించేందుకు తగిన ప్రణాళికలను రూపొందించి, వేగవంతంగా పనులను పూర్తి చేయాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక మూడో డివిజన్ మైపాడు రోడ్డు, సింహపురి కాలనీ, ప్రశాంతి నగర్, వేణుగోపాలస్వామి నగర్ తదితర ప్రాంతాలలో కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్య భవన్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. చేపల క్రయవిక్రయాలకు, వినియోగదారులకు, విక్రయదారులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా ప్రాంగణంలో అవసరమైన మేరకు ఆధునిక నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో అన్ని డ్రైన్ కాలువలలో పూడికతీత పనులు ఎత్తివేత క్రమం తప్పకుండా జరిగేలా సంబంధిత శానిటేషన్ అధికారులు వార్డు సచివాలయ కార్యదర్శులు నిరంతర పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. సింహపురి కాలనీలో డ్రైన్ కాలువల నిర్మాణాల కోసం అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. పర్యటనలో భాగంగా స్థానిక సింహపురి పార్కు, జాఫర్ సాహెబ్ కెనాల్ కట్ట పాఠశాలలను కమిషనర్ సందర్శించి వసతులను పరిశీలించారు. అనంతరం స్థానిక రామలింగాపురం అన్న క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. టోకెన్ విధానం ద్వారా మాత్రమే ప్రజలకు ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభం : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణం బస్టాండ్ సెంటర్లో కోవూరఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చలివేంద్ర ప్రారంభించారు. వేసవి సందర్భంగా ప్రజల దాహార్తి తీర్చేందుకై చలివేంద్ర ఏర్పాటు చేసిన బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయతి కమీషనర్ బాలకృష్ణ, ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజలను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభినందించారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఇటువంటి ప్రజాహిత కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, పఠాన్ నస్రీన్ ఖాన్లతో పాటుటిడిపి నాయకులు బత్తుల హరికృష్ణ, ఎంవి శేషయ్య, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రేపటి నుంచి గంగమ్మతల్లి ఉత్సవాలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు జరిగి మండలం రోజులు పూర్తయిన సందర్భంగా గంగమ్మతల్లి ఉత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం అమ్మవారి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, జల్లిస్నానం, రాత్రికి గ్రామోత్సవం, శనివారం గంగమానుకి ఇంటి ఆడపడుచులా ఆనకట్టు కట్టిరావడం, గుడారి కథ, ముద్దలపోలు, బోనాల ఉత్సవం, ఆదివారం అమ్మవారికి పొంగళ్లు, అన్నదాన కార్యక్రమం జరుగుతాయన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని వారు కోరారు.

## కమిషనర్‌ను కలిసిన యూనియన్ సభ్యులకు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా వై.ఓ. నందన్ పూర్తి బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలోని కమీషనర్ ఛాంబర్ నందు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని, పుష్పగుచ్చాలతో అభినందనలు తెలియజేశారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** 2025 మార్చి నెలలో జరిగిన పదవతరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుండి ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యల నుండి బాలురు, బాలికలు మొత్తం 28,275మంది విద్యార్థులు హాజరు కాగా 23,633 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై, ఉత్తీర్ణత శాతము 83.58తో రాష్ట్రంలో 13వ స్థానం లభించిందన్నారు. జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో 10, 211 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కాగా 7,414 మంది ఉత్తీర్ణులై, ఉత్తీర్ణత శాతం 73.62 శాతము సాధించడం మైనదని అన్నారు. ఇందులో 595 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన జడ్పీ పిహెచ్ఎస్ కృష్ణ నగర్‌కు చెందిన ఎం.పూజిత 595 మార్కులు సాధించగా, రెండవ స్థానములో నవలాకుల తోట జడ్పీ పిహెచ్ఎస్‌కు చెందిన ఎండి జువేరియాకు 594 మార్కులు సాధించగా, 593 మార్కులు సాధించి వింజమూరు జెడ్పి పిహెచ్ఎస్‌కు చెందిన జి.జ్ఞాపిక, నరసాపురం ఎంవి ఆర్ఆర్ జడ్పీ పిహెచ్ఎస్‌కు చెందిన జి.భార్గవ్ అనే ఇద్దరు విద్యార్థులు మూడవ స్థానంలో సాధించినారని తెలిపారు. అదేవిధంగా, జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో 100 మంది విద్యార్దులు, 575 మార్కులు పైగా సాధించారని, జిల్లాలో 16 పాఠశాలలో పరీక్షలకు హాజరైన మొత్తం విద్యార్థులు 100 శాతము ఉత్తీర్ణులైనారని తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ ద్వారా అందించిన విజయదీపిక స్టడీ మెటీరియల్ ఫలితాలు సాధించుటకు చాలా ఉపయోగకరంగా వుందని విద్యార్థులు విద్యాశాఖ తెలియజేసారు అన్నారు. ఈ సందర్భముగా జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి, రెండవ మూడవ స్థానాలలో నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు, పాసైన అందరు విద్యార్థినీ విద్యార్థులకు నా శుభాశీస్సులు తెలిపారు. రాబోవు సంవత్సరాలలో 100 శాతం ఉత్తీర్ణత పాఠశాల సంఖ్య పెరగాలని, జిల్లా ర్యాంకును ఇంకా మెరుగుపరిచే విధముగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ వారిని కోరుకుంటున్నాను అని జడ్పీ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అన్నా రు.జిల్లా విద్యాశాఖాధికారికి, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులకు నా అభినందనలు తెలియజేస్తున్నాను అన్నారు.

# తీర ప్రాంత గిరిజనులకు ఆధార్ కార్డులు మంజూరు చేయండి



**కావలి, మేజన్‌న్యూస్ :** పేద గిరిజనులకు తీర ప్రాంతంలో నివసిస్తున్న పేద గిరిజనులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుండి వచ్చు సంక్షేమ పథకాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని బుధవారం దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి తెలిపారు. అనంతరం గిరిజనులు కలిసి కావలి తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసిల్దార్‌కి వినతిపత్రం అందించారు. ఆధార్ కార్డులకి అనేక నిబంధనలో ఉండడం వల్ల తీసుకోలేకపోయామని తుమ్మలపెండ గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తపరిచారు. తీర ప్రాంత గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సచివాలయం ఉద్యోగస్తులు స్థానిక రెవిన్యూ అధికారులు తుమ్మలపెంట తీరప్రాంత ఏనాది కాలనీకి పట్టించుకోకపోవడం వలన 100శాతం ఆధార్ కార్డులు లేవన్నారు. వారిని గాలికి వదిలేసారని తెలిపారు. కలెక్టర్ స్పందించి డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ లేకపోయినప్పటికీ గిరిజనులకు తక్షణమే ఆధార్ కార్డులు ఎన్రోల్ చేయాలని ఆదేశించడంతో కావలి తహసిల్దార్ శ్రవణ్ కుమార్ చొరవతో 25 మంది పెద్ద గిరిజనులకు ఆధార్ కార్డులు ఎన్రోల్ చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు సమీకరించి అన్న క్యాంటీన్లో ఆహారం తిని ఆధార్ కార్డు ఎన్రోల్ హాజరవుతున్నారని తెలిపారు. స్థానిక అధికారులు గిరిజనుల పేరు చెప్పి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. దొంగ సర్టిఫికెట్లు ఏరివేయాలని లేకపోతే ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేషమ్మ, మానికల్ రమణయ్య, గబ్బర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మండలంలో టెన్త్‌లో 87.79శాతం ఉత్తీర్ణత

**● ప్రవేట్‌లో 97.1శాతం, ప్రభుత్వంలో 71.48శాతం ● రెండు పాఠశాలల్లో 100శాతం**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో మొత్తం పదవతరగతి విద్యార్థుల్లో 87.79శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 13 ప్రభుత్వ పాఠశాలల్లో 477 మందికి గాను 341మంది (71.48శాతం) ఉత్తీర్ణులయ్యారు. 9ప్రవేటు పాఠశాలల్లో 350మందికిగాను 340మంది (97.1శాతం) ఉత్తీర్ణత సాధించారు. మండల ఫస్ట్‌గా ఆత్మకూరు పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన బి.సంజన 600కుగాను 595మార్కులు సాధించి నిలిచారు. శ్రీచైతన్య, మేధా ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. పట్టణంలోని గురుకుల బాలికల పాఠశాలలో 78మందికి75మంది (96.15శాతం) ఉత్తీర్ణులు కాగా కె.పూజిత(590), పి.మోక్షిత(581) మార్కులతో ప్రథమ, ద్వితియ స్థానాలు సాధించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 66కు50మంది(75.76శాతం) ఉత్తీర్ణులుకాగా ఓ.సాయిధనుష్ (565), పి.ప్రదీప్‌కుమార్(556)లు ప్రథమ,ద్వితియస్థానాలు పొందారు. స్థానిక జెడ్పి బాలికోన్నత పాఠశాలలో 103కు85మంది(82.52) ఉత్తీర్ణులు కాగా షేక్ సల్మా(583), సయ్యద్ హన్సియా(573), అప్పారావుపాళెం జెడ్పిస్కూల్లో 17కు12మంది(70.59) ఉత్తీర్ణులుకాగా సి.హెచ్. శ్రీనివాస సాయితేజ (538), పిపివి నర్సింహ(504), ఆత్మకూరు వెస్ట్ జెడ్పిస్కూల్లో 32కు17మంది(53.13), బి.ఏ.సాత్విక్(570), షేక్ సుహేల్(560), బట్టేపాడు జెడ్పిస్కూల్లో 14కు10మంది(71.43), ఏ.అజిత్(582), డి.మోక్షరం (564), విక్రమ్‌సింహ(564), చెర్లోయడవల్లి జెడ్పిస్కూల్లో 19కు18మంది (94.74), వి.ప్రవల్లిక(583), సుల్తాన్‌బాషా(572), కరటంపాడు జెడ్పిస్కూల్లో 54కు47మంది(87.04), లాస్యచౌదరి(572), మహ్మద్‌సమీద్ (561), ఎల్‌ఆర్‌పల్లి జెడ్పిస్కూల్లో 23కు18మంది(78.26), షేక్‌సైదా (558), విష్ణుతేజ(533), మహిమలూరు జెడ్పిస్కూల్లో 30కి19మంది((63.33), మన్సూర్‌ఆలీ(538), కావ్య (518), మురుగుళ్ళ జెడ్పిహైస్కూల్లో 10కి9మంది (90శాతం), ప్రతిమ(528), అనీల్(459), పేరారెడ్డిపల్లి జెడ్పిస్కూల్లో 15కు14(93.33), అమీర్‌తాజ్(577), గాయత్రి (558), వాసిలి జెడ్పిహైస్కూల్లో 16కు12మంది (75శాతం), హరీష్(497), ప్రణీత్(459)లు ప్రథమ, ద్వితియ స్థానాలు పొందగా మార్కుల పరంగా ప్రభుత్వ పాఠశాల్లో గురుకులపాఠశాల, అప్పారావుపాళెం, మురు గుళ్ళ ప్రథమ,ద్వితియ, తృతియస్థానాలు పొందాయి.

ప్రవేటు స్కూల్స్‌లో మేధా ఇంగ్లీష్‌మీడియం స్కూల్ 18కి18మంది(100శాతం) ఉత్తీర్ణులుకాగా సుల్తాన్, షితి(570), రిధాఫాతిముల్లా(567)లు ప్రథమ, ద్వితియస్థానాలు పొందారు. శ్రీచైతన్య ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో 71కి71(100) ఉత్తీర్ణులు కాగా బి.సంజన (595), ఏ.సౌమ్య(593), నలంద ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో 42కు41మంది(97.62), లాస్యశ్రీ(589), అవతి(584), ప్రగతి ఇంగ్లీష్ మీడియంస్కూల్లో 37కు35మంది(94.59), జగదీష్(586), లక్ష్మిప్రియ (583), రెయిన్‌బో ఇంగ్లీష్‌మీడియంస్కూల్లో 32కు 31మంది (96.88), నాగచరణ్(578), హరిచేతన(564), సాయిలిటిల్‌ఏంజెల్స్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో 25కు24మంది(96శాతం), మహిమ(582), హనీఫ్, అన్షాన్‌లు (578), శ్రీనివాసా ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో 30కి 28మంది (93.33), జస్వంత్(578), అలుమా(576), సెయింట్‌మేరీస్ ఇంగ్లీష్ మీడియంస్కూల్లో 37కు 36మంది(97.30), గౌతంరెడ్డి, తేజస్వినిలు (575), యశ్వంత్ కుమార్ 570మార్కులు సాధించి ఆయా పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితియస్థానాల్లో నిలిచారని ఎంఈఓ సి.హెచ్.అనంతలక్ష్మి పేర్కొన్నారు.

# అభివృద్ధి,సంక్షేమానికి సమానప్రాధాన్యత

**● సమస్యలపరిష్కారానికి ప్రత్యేక చర్యలు ● మండలమీట్‌లో ఎంపిపి "కేతా"**







**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో అభివృద్ధి, సంక్షేమానికి సమానప్రాధాన్యత ఇస్తున్నామని, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో మరింతగా మండలాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామని ఆత్మకూరు మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో ఎంపిడివో పి.ఐజాక్‌ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలసర్వసభ్యసమావేశానికి కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. తొలుత ఇటీవల మృతిచెందిన కరటంపాడు ఎంపిటిసి మెంబర్ షేక్ షాసిమ్‌సాహెబ్ ఆత్మకు శాంతిచేకూరాలంటూ తీర్మానం చేసి రెండు నిముషాలు మౌనంపాటించి ఆయన మృతికి సంతాపం తెలిపారు. అనంతరం శాఖల వారీగా అధికారులు అమలులోఉన్న కార్యకలాపాలను వివరించారు. అనంతరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ప్రసంగిస్తూ వేసవి తీవ్రంగా ఉన్నందున త్రాగునీటి సమస్యలు లేకుండేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీటి బోర్లకోసం జిల్లాపరిషత్‌కు ప్రతిపాదనలు పంపామని, త్వరలో మంజూరవుతాయన్నారు. ఉపాధిహామీపథకం పనులు ఉదయం 11గంటలలోగా పూర్తిచేసేలా చూడాలని, పనులు జరిగేచోట ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్సా కిట్లు సిద్ధంగా ఉంచాలని ఆయన సూచించారు. అర్హులైన పేదలు గృహనిర్మాణాలపై దృష్టి సారించేలా ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు కృషిచేయాలని ఆయన సూచించారు. మంజూరైన గృహాల్లో అధికశాతం ఇంకా ప్రారంభించనందున ప్రజాప్రతినిధులు లబ్దిదారులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఇటీవల జరిగిన ఐఏబి సమావేశంలో మంత్రి రామనారాయణరెడ్డి చొరవతో సోమశిల జలాలు ఆత్మకూరు వరకు రెండవపంటకు విడుదల చేసేలా నిర్ణయించారని, రైతులు అధికారుల సూచనల మేరకు సాగునీటి లభ్యతనుబట్టి వరిసాగు, ఆరుతడిపంటలు సాగుచేసుకోవాలని, సాగునీటి కొరతలేకుండేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మంత్రి రామనారాయణరెడ్డి ప్రత్యేక శ్రద్ధతీసుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తుండగా అందులో ఆత్మకూరు మండలం కూడా అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు. మే1వతేదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆత్మకూరులో పర్యటించనున్నారని, ఆత్మకూరు మండలం నారంపేటవద్ద పారిశ్రామికపార్కును ప్రారంభించనున్నారని, త్వరలో పరిశ్రమలు సాధించేందుకు కూడా మంత్రి రామనారాయణరెడ్డి చర్యలు తీసుకుంటారని, తద్వారా ఆత్మకూరు మండలానికి ఎంతో ప్రయోజనం చేకూరనుందని వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సాగు,త్రాగునీరు, విద్య,వైద్యం, ఉపాధిహామీపనులు, గ్రామాల్లో సిమెంటురోడ్లు, గృహనిర్మాణాలపై ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గ్రామాల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపిడివో పి.ఐజాక్‌ప్రవీణ్ కోరారు. మండలపరిషత్ కార్యాలయ పాలనాధికారి కె.శ్రీనివాసరావు ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ సమావేశంలో మండలపరిషత్ ఉపాధ్యక్షుడు ఉద్దాల పెంచలరావు, మురుగుళ్ళ, వాసిలి ఎంపిటిసి మెంబర్లు బొడ్డు సుభాషిణి, గద్దె లక్ష్మిప్రసన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఏయి సాంబయ్య, పంచాయతీరాజ్ ఏపి ఖాదర్‌మస్తాన్, హౌసింగ్ ఏయి శరత్‌చంద్ర, ఐసిడిఎస్ ప్రతినిధి పి.రాధ, వైద్య,ఆరోగ్యశాఖ ప్రతినిధి సైదా, మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు, మండల విస్తరణాధికారి డేవిడ్‌జ, ఉపాధిహామీపథకం ఏపివో మధుసూధన్, ఇరిగేషన్ ఏయి రాజేశ్వరరావు, ఆర్‌అండ్‌బి ఏయి అమానుల్లా, మండలరెవిన్యూ కార్యాలయ ప్రతినిధి కె.పెంచలయ్య, సర్పంచ్‌లు పి.చంద్రశేఖర్(మహిమలూరు), చెలికా రమాహరిబాబు(వాసిలి), సోమవరపు వెంకటరమణారెడ్డి(నాగులపాడు), రావిళ్ళ వెంకటేశ్వర్లు(దేపూరు), మాముదూరు నరశింహులు(పడకండ్ల), బొలిగర్ల వెంకటేశ్వర్లు(బి.చిరువెళ్ళ), తదితరులు పాల్గొన్నారు.

## పేరారెడ్డిపల్లి జెడ్పిస్కూల్లో 93.33శాతం ఉత్తీర్ణత





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డి పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులు 93.33శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. మొత్తం15మంది విద్యార్థులు పరిక్షలకు హాజరుకాగా 14మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. తమ పాఠశాలకు చెందిన సయ్యద్ అమ్రీన్‌తాజ్ 600కుగాను 577మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలువగా మున్నా గాయత్రి 558మార్కులతో ద్వితియస్థానంలో, పెరుమాళ్ళ సాయిచరణ్ 548మార్కులతో తృతియస్థానంలో నిలిచారని భాస్కరరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. తమ పాఠశాలలో ఉపాధ్యాయులు బోధనపట్ల చూపుతున్న చిత్తశు ద్ధి,అంకితబావం, విద్యార్థుల్లో శ్రద్ధ,పట్టుదల ఈ ఫలితాలను సాధించామని భాస్కరరెడ్డి పేర్కొన్నారు.

## ప్రజల దాహార్తితీర్చబూనడం అభినందనీయం

**డాక్టర్ పోకల సేవలు అమోఘం : కమీషనర్ నందన్**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వంత నిధులతో చలివేంద్ర ఏర్పాటు చేసిన డెల్టా హాస్పిటల్‌అధినేత డాక్టర్ పోకల రవి అభినందనీయుడని నెల్లూరు కార్పోరేషన్ కమీషనర్ వై.వో.నందన్ పేర్కొన్నారు. నెల్లూరులోని పూలేవిగ్రహం సమీపంలోని వెంకట్రామాపురంలో బుధవారం డాక్టర్ పోకల రవి ఏర్పాటుచేసిన చలివేంద్రను కమీషనర్ నందన్, వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డిలు ప్రారం భించారు. ఈసందర్భంగా కమీషనర్ నందన్ మాట్లాడుతూ ఈదపా ఎండలవేడిమి తీవ్రంగా ఉన్నందున ప్రజలకు అందుబాటులో త్రాగునీరు ఉండడం అత్యంతావశ్యకమన్నారు. రాష్ట్ర పురపాలకశాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సూచనలతో డాక్టర్ పోకల రవి చలివేంద్రను ఏర్పాటు చేయడం అత్యంత సంతోషదాయకమన్నారు. డాక్టర్ రవి ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహకపారితోషికాలు, అనాధపిల్లలకు ఆర్థికసా యాలు, ఉన్నతవిద్య అభ్యశించే పేదలకు చేయూత తదితర అనేక సామాజికసేవా కార్యక్రమాలు అత్యంత అమోఘమని వారు కొనియాడారు. విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ.. తీవ్రగ్రీష్మతాపం సందర్భంగా ప్రజలకు త్రాగునీరు అందుబాటులో ఉంచేలా చలివేంద్ర ఏర్పాటు అభినందనీయం, స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. డాక్టర్ పోకల రవి ప్రసంగిస్తూ మంత్రి పొంగూరు నారాయణ తమకు స్ఫూర్తిదాయకమని, ఆయన సూచనలతో చలివేంద్ర ఏర్పాటు చేవానన్నారు. వివిద సామాజిక సేవా కార్యక్రమాలు కూడా మంత్రి నారాయణ స్ఫూర్తితోనే నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇండ్ల రాఘవేంద్రరావు, టిడిపి నాయ కులు ఇలియాజ్, పుట్టా సురేంద్ర, శ్రీనివాసులు, జితేంద్ర, జిన్ని, ప్రసాద్ నాయుడు, జనసేన నాయకులు డాక్టర్ బెల్లపు సుధామాధవ్, వివిద ప్రజాసంఘాలకు చెందిన కమతం సుబ్బారావు, చెక్కా గురుకుమార్, పామూరు మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు. అతిధులకు డాక్టర్ పోకలరవి ప్రత్యేక సన్మానాలు చేసి ధన్యవాదాలు తెలిపారు.